క్లుప్తంగా

నర్తకీమణులకు సత్కారం



మెమెంటోలు అందుకుంటున్న నర్తకీమణులు

కాకినాడ కల్చరల్: తమిళనాడులోని బృహదీశ్వర ఆలయంలో ప్రతిష్టాత్మకంగా బృహన్నాట్యాంజలి ట్రస్టు ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ నృత్యోత్సవంలో కాకినాడకు చెందిన నాట్యాచార్య డాక్టర్ కృష్ణకుమార్ శిష్య బృందం ప్రదర్శన ప్రేక్షకులను మెప్పించింది. వీరికి ట్రస్టు మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందజేసి సత్కరించారు. బృందంలో నర్తకీమణులు అరుణరేఖ, సౌమ్యరేఖ, మనస్వినీకృతి, గాయిత్రి సౌజన్య, గాయత్రి మెహాల్, త్రినయని, తేజస్విని, మల్లిక, ఉమామహేశ్వరి, నాట్యాచార్య కృష్ణకుమార్‌ను నగర ప్రముఖులు అభినందించారు.

ఒకటి నుంచి గాలికుంటు టీకాల పంపిణీ

కరప: జాతీయ పశువ్యాధి నియంత్రణలో భాగంగా పశువుల్లో వచ్చే గాలికుంటువ్యాధి నివారణకు మార్చినెల ఒకటో తేదీ నుంచి టీకాలు వేసేందుకు అన్నిచర్యలు తీసుకుంటున్నట్టు కరప సబ్ డివిజన్ ఏడీ డాక్టర్ ఏజేఎస్ సురేష్‌బాబు తెలిపారు. కరపలో శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కరప సబ్ డివిజన్ పరిధిలోని కరప, కాకినాడ రూరల్, అర్బన్ మండలాలలో 30,073 పశువులు ఉన్నాయన్నారు. వీటికి గాలికుంటువ్యాధి నివారణ టీకాలు వేసేందుకు 26,450 డోసులు సిద్ధం చేశామన్నారు. మండలంలో మూడు బృందాలు, రూరల్ మండలంలో రెండు బృందాలు, అర్బన్‌లో ఒక బృందం పర్యవేక్షణలో 40 మంది సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రతి పశువుకు గాలికుంటు వ్యాధి టీకా వేస్తారన్నారు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ

కాకినాడ సిటీ: ప్రతీ కార్మికునికి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, అందరికీ కనీస పెన్షన్ రూ.10 వేలు చెల్లించాలని, పంటలకు మద్దతు ధర చట్టం చేయాలని కోరుతూ ఏప్రిల్ 5న చలో ఢిల్లీకి సీఐటీయూ వర్కింగ్ కమిటీ పిలుపునిచ్చింది. శనివారం కాకినాడ కచేరీపేటలో జిల్లా యూనియన్ భవనంలో వర్కింగ్ కమిటీ సమావేశంలో పలువురు నాయకులు పాల్గొని మాట్లాడారు. పేద, మధ్య తరగతి రైతు, వ్యవసాయ కార్మికుల అప్పులను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని తదితర డిమాండ్లు చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు దువ్వా శేషుబాబ్జీ, జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఐఐఎఫ్‌టీ విద్యార్థుల స్వచ్ఛ సేవ



ఐఐఎఫ్‌టీ విద్యార్థులతో కమిషనర్ (ఎఫ్‌ఏసీ)

కాకినాడ: స్థానిక వివేకానంద పార్కు పరిశుభ్రతకు నగరపాలక సంస్థ సిబ్బందితో కలిసి ఐఐఎఫ్‌టీ విద్యార్థులు చేయి కలిపారు. పార్కు ఆవరణలోని చెత్త తొలగించారు. నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్‌ఏసీ) సీహెచ్ నాగ నరసింహారావు, ఆరోగ్యాధికారి డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ ఇన్స్పెక్టర్ సత్తెప్ప నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు డయల్ యువర్ డీఎం

కాకినాడ: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు, ఫిర్యాదులు, సూచనలపై సోమవారం ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు డయల్ యువర్ డీఎం నిర్వహించనున్నట్టు ఆర్టీసీ కాకినాడ డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ చెప్పారు. ప్రయాణికులు మొబైల్ నెంబర్ 99592 25534 నెంబర్‌కు డయల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని ఆర్టీసీ అధికారులు సద్వినియోగం చేసుకుని సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న భువనేశ్వర్

కాకినాడ రూరల్: రమణయ్యపేట పరిధి రాయుడుపాలెంలో నివసిస్తున్న రాజులపూడి భువనేశ్వర్ (53) శనివారం నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సర్పవరం పోలీసుల వివరాల ప్రకారం అమలాపురంలో సోదరులతో కలసి భువనేశ్వర్ కేబుల్ వ్యాపారం చేసేవాడు. మూడేళ్లుగా వ్యాపారం లేవాదేవీలు తేల్చకపోవడం, ఉమ్మడి స్థలం వ్యవహారం కోర్టులో ఉండడంతో ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. శనివారం రాయుడుపాలెం నివాసం నుంచి సోదరుడు, మరో సోదరుడి కుమారుడుతో సదరు లావాదేవీలపై మాట్లాడిన తరువాత గదిలోకి వెళ్లి అధిక మోతాదులో నిద్రమాత్రలు మింగినట్టు ఆయన భార్య ఆరుద్ర పోలీసులకు తెలియజేశారు. వెంటనే అంబులెన్స్‌లో తొలుత జీజీహెచ్, తరువాత అపోలో ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై సీఐ ఆకుల మురళీకృష్ణ మాట్లాడుతూ భువనేశ్వర్ అపోలో ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నారని, కేసు నమోదు చేస్తామన్నారు.

ఉప్పలంకలో టీడీపీ పర్యటన

కరప: మండలం ఉప్పలంకలో శనివారం ఇంటింటికీ మీ అనంతలక్ష్మి, ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ జెడ్పీటీసీ బుంగా సింహాద్రి, పంతాడ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాదికి గృహప్రవేశాలు

- టిడ్కో ఇళ్ల అప్పగింతకు సత్వర చర్యలు
- రెండు దశల్లో అందజేసేందుకు ప్రణాళిక
- రుణాలు మంజూరు దిశగా చర్యలు



కాకినాడ పర్లోపేటలో నిర్మించిన టిడ్కో ఇళ్లు

కాకినాడ: టిడ్కో ఇళ్లను మార్చి, ఏప్రిల్ నెలల్లో రెండు విడతలుగా లబ్ధిదారులకు అప్పగించేందుకు చర్యలు వేగవంతం చేశారు. గృహ సముదాయాల్లో మౌలిక వసతుల కల్పన, రుణాల మంజూరు, ఇతర సాంకేతిక అవరోధాలను అధిగమించే దిశగా అధికారులు సాగుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన పొరపాట్లను సరిదిద్ది అర్హులకు టిడ్కో ఇళ్లను అందించే దిశగా తొలి విడత మార్చి చివరి నాటికి, రెండవ విడత ఏప్రిల్‌లోను ఇచ్చేలా సన్నాహాలు చేస్తున్నారు.

మొత్తం ఇళ్లు 2056

కాకినాడ పర్లోపేట ప్రాంతంలో మొత్తం 2056 టిడ్కో ఇళ్లు నిర్మించారు. రూ.75.04వ కోట్ల వ్యయంతో ఇప్పటికే 1588 ఇళ్లకు గ్రౌండింగ్ పూర్తయ్యింది. వీరిలో 89 మంది సొంత నిధులతో ఇళ్లు నిర్మించుకున్నారు. ఇంకా 491 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. ఒకొక్క ఇంటి నిర్మాణానికి రూ.7.65 లక్షలు కాగలదని అంచనా వేయగా, ఇందులో 2.2 లక్షలు రాష్ట్ర ప్రభుత్వ వాటాగా, రూ.1.05 లక్షలు కేంద్ర ప్రభుత్వ వాటాగా, రూ.50వేలు లబ్ధిదారుని వాటాగా నిర్ణయించారు. మరో 3.65 లక్షలు బ్యాంకు రుణంగా సమకూర్చుకోవలసి వుంటుంది.

బ్యాంకుల ద్వారా రుణాలు

అర్హులైన లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు ఇప్పించేందుకు నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంది. ఇప్పటికే బ్యాంకర్లతో అనేక పర్యాయాలు సంప్రదింపులు జరిపింది. మెప్మా, నగరపాలక సంస్థ అధికారుల సమన్వయంతో రుణమంజూరు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ఇళ్ల ప్రగతిని సమీక్షిస్తున్నారు. అధికారుల సమాచారం ప్రకారం సుమారు 330 మందికి సంబంధించిన బ్యాంకు రుణాల ప్రక్రియ పెండింగ్‌లో ఉంది.

> **త్వరలోనే టిడ్కో ఇళ్ల అప్పగింత**
>
> టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించేందుకు అవసరమైన చర్యలు వేగవంతం చేశాం. మౌలిక వసతుల కల్పన, రుణాల మంజూరు వంటి అంశాలపై ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నాం.
>
> – సీహెచ్ నాగనరసింహారావు, కమిషనర్(ఎఫ్‌ఏసీ), కాకినాడ



గురుకులాల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఏజీఓ సూరిబాబు
- భోజన మెనూ, వసతులపై ఆరా



విద్యాలయంలో వంటకాలను పరిశీలించి, విద్యార్థులకు వడ్డిస్తున్న ఏజీఓ సూరిబాబు

కరప: స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాన్ని శనివారం ఏజీఓ (అకడమిక్ గైడ్‌లైన్స్ ఆఫీసర్) ఏవీ సూరిబాబు ఆకస్మిక తనిఖీచేశారు. విద్యాలయంలోని వసతులు, భోజన పథకం అమలు, పాఠశాల నిర్వహణపై ఆయన విద్యార్థులను అడిగితెలుసుకున్నారు. మూడు రోజులుగా చిక్కీ ఇవ్వడం లేదని విద్యార్థులు చెప్పడంతో ఏజీఓ వార్డెన్ వి.నానిబాబును ప్రశ్నించగా చిక్కి సరఫరా లేదని, ఇండెంట్ పెట్టినా రాలేదని, ప్రత్యామ్నాయంగా పుచ్చకాయ ముక్కలు ఇస్తున్నామని తెలిపారు. దీంతో చిక్కీలు వచ్చేలోగా వేరుశెనగ ఉండలు కొనుగోలుచేసి, ఇవ్వాలని ఏజీఓ ఆదేశించారు. అలాగే విద్యాలయం ప్రాంగణంలో నేలపై బరకాల మీద కూర్చొని భోజనాలు చేయడంపై ప్రశ్నించగా డైనింగ్ హాల్ లేదని ఉపాధ్యాయులు తెలిపారు. స్టోర్ రూమ్‌లో సరుకుల నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం సూరిబాబు విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లో 19 జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాలు ఉన్నాయని, కృష్ణాజిల్లాలో మూడింటికి సొంత భవనాలుండగా, మిగిలినవన్నీ అద్దె భవనాల్లో ఉన్నాయన్నారు. ఒక్కో పాఠశాలను రెండు నెలలకొకసారి తనిఖీచేసి, లోపాలుంటే సరిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కరపలోని గురుకుల విద్యాలయానికి పూర్తిస్థాయిలో భవన వసతిలేక 300 మంది విద్యార్థులకే పరిమితమైందన్నారు. కాకినాడ అర్బన్‌కు సమీపంలో ఎక్కడైనా మంచి భవనం అద్దెకు దొరికితే మార్చే ప్రతిపాదన ఉందని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు గురుకుల విద్యాలయానికి నాడు-నేడు పథకంలో కొత్తభవనం నిర్మించేందుకు స్థలాన్ని కేటాయించారని, అవ్వన్నీ పూర్తయ్యే సరికి సమయంపడుతుందని ఈ లోగా భవనం అమరితే మారుస్తామని, అప్పుడు 480 మందిని చేర్చుకునేందుకు అవకాశం ఉంటుందని ఆయన చెప్పారు. కరపలో ప్రిన్సిపాల్ లేక ఇన్‌చార్జి అధికారితో ఇబ్బందులున్నాయని ఏజీఓకు వివరించగా రెండు, మూడు నెలల్లో గురుకుల విద్యాలయాల ప్రిన్సిపాళ్లకు పదోన్నతులు లభించనున్నాయని, అప్పుడు ఈ పోస్టు భర్తీ అవుతుందని బదులిచ్చారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.1.01 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు శనివారం సాయంత్రం మండలంలోని ముగ్గురు లబ్ధిదారులకు అందించారు. నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, విత్తనాల రమణ, రాయుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

కరప: మండలం అరట్లకట్టలో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు సోడగం గురుమూర్తి కుటుంబసభ్యులను, గ్రామ కమిటీ అధ్యక్షుడు సోడగం సూరిబాబును ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పరామర్శించి, సంతాపం తెలిపారు. సర్పంచ్ గోపి సత్యవేణి, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ సిబ్బందిని తొలగిస్తూ కలెక్టర్ ఆదేశాలు

కాకినాడ క్రైం: రోగుల నుంచి డబ్బు వసూళ్లకు పాల్పడ్డ ఔట్ సోర్సింగ్ సిబ్బందిని తొలగిస్తూ కలెక్టర్ కృతికా శుక్లా నిర్ణయం తీసుకున్నారు. ముగ్గురు రెగ్యులర్ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జీజీహెచ్ శానిటేషన్ విభాగంలో అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఎ.లక్ష్మి, జి.మంగ కొద్ది రోజుల క్రితం జీజీహెచ్‌లో రోగుల నుంచి డబ్బు వసూలు చేశారు. ఈ విషయంపై రోగుల బంధువులు సూపరింటెండెంట్ హేమలతాదేవికి ఫిర్యాదు చేశారు. విచారణలో తప్పిదం నిర్ధారణ కావడంతో వారిని ఉద్యోగాల నుంచి తొలగించాలంటూ కలెక్టర్ కృతికాశుక్లా సూపరింటెండెంట్‌ని ఆదేశించారు. ఈ మేరకు శనివారం వారిని ఉద్యోగాల నుంచి తొలగించారు. అలాగే, రెగ్యులర్ విధానంలో ఏంఎన్‌వోలుగా పనిచేస్తున్న పండు, మురళీమోహన్, ఎఫ్ఎన్‌వోగా పనిచేస్తున్న సుభాషిణి కొద్ది రోజుల క్రితం బయాప్సీ చేసేందుకు రోగిని వార్డుకు తరలించి డబ్బులు గుంజిన ఘటనపై వారి ముగ్గురికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

ఆలయ ఈఓగా ఘనమైన సేవలు



కె.విజయలక్ష్మిని సత్కరించిన ధర్మకర్తల మండలి చైర్మన్ పుల్ల నారాయణరావు, సిబ్బంది

కాకినాడరూరల్: సర్పవరం రాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి ఆలయంలో ఈఓగా పనిచేసిన కె.విజయలక్ష్మి సేవలు అభినందనీయమని ధర్మకర్తల మండలి చైర్మన్ పుల్ల నారాయణరావు పేర్కొన్నారు. శనివారం ఆలయంలో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో విజయలక్ష్మిని సత్కరించారు. 13 నెలలుగా ఆలయంలో బాధ్యతలు నిర్వహించి రెండు పర్యాయాలు మాఘ మాసోత్సవాలు నిర్వహించి అంకిత భావంతో పనిచేసే అధికారిణిగా గుర్తింపు తెచ్చుకోవడం ముదావహమన్నారు. కమిటీ సభ్యులు ఎల్.శ్యామలావతి వీరభద్రరాజు, ఘంటసాల బద్రీనారాయణ, జోకా సత్తిబాబు, పుల్ల వీరవెంకట సత్యనారాయణ, వాసంశెట్టి లక్ష్మిశ్రీను, వార్డు సభ్యులు గంటసాల సతీష్, పూర్వపు ఈఓ వుండవిల్లి వీర్రాజు, తాజా ఈఓ భీమశంకర్, అర్చకులు వెంకటాచార్యులు, రామకిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి హోమం, షష్ఠి పూజలు



కరపలోని 51 అడుగుల సుబ్రహ్మణ్యేశ్వరుని విగ్రహం

కరప: స్థానిక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహంవద్ద శనివారం ఆలయ ధర్మకర్త చిక్కాల దొరబాబు, సావిత్రి దంపతులు హోమం, షష్ఠి పూజలు నిర్వహించారు. గతేడాది నవంబరులో కాకినాడ–రామచంద్రపురం ప్రధాన రహదారిలో కరప, పెనగుదురు గ్రామాలమధ్య ఆలయ ధర్మకర్తలు చిక్కాల దొరబాబు, సుబ్బారావు సోదరులు 51 అడుగుల ఎత్తున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి విగ్రహాన్ని నిర్మించి, ఆవిష్కరించారు. అప్పటినుంచి ప్రతి నెలా షష్ఠిరోజున స్వామివారికి హోమం తదితర పూజలు చేస్తున్నట్టు దొరబాబు తెలిపారు. వేదపండితుడు భాగవతుల సాయిసతీష్‌శర్మ పూజలు చేయించారు. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సబ్‌జైలులో న్యాయ విజ్ఞాన సదస్సు



నిందితులకు పెట్టే భోజనాన్ని పరిశీలిస్తున్న మెజిస్ట్రేట్లు సత్యకాంత్, మాధవి

కాకినాడ లీగల్: ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని, అనవసర గొడవలకు వెళ్లడం వల్ల సమాజంలో ఇబ్బందులు ఎదుర్కొనవలసి వస్తుందని మెజిస్ట్రేట్లు సత్యకాంత్, మాధవి తెలిపారు. స్థానిక స్పెషల్ సబ్ జైలులో నిందితులకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. నాలుగో అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సీకేవీ సత్యకాంత్, స్పెషల్ ఎక్సైజ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఎం.మాధవి మాట్లాడుతూ ఎవరికైనా న్యాయవాదులను పెట్టుకునే స్తోమత లేకపోయినా తమ మండల న్యాయసేవాధికార సంస్థకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రతి నిందితుడిపై ఉన్న కేసుల్లో 60 నుంచి 90 రోజుల్లో పోలీసులు చార్జిషీటు వేయకపోతే బెయిల్ పొందే హక్కు ఉందన్నారు. నిందితుల సమస్యలు, వసతులు, భోజనం తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. సబ్ జైలు సూపరింటెండెంట్ ఎం.వీరబాబు, డిప్యూటీ జైలర్ జోసఫ్, కోర్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణకు చట్టం చేయాలి

పిఠాపురం: న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఆలిండియా లాయర్స్ యూనియ (ఏఐఎల్‌యూ) మహా సభలో వక్తలు డిమాండ్ చేశారు. పిఠాపురం 12వ అదనపు జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లో శనివారం పిఠాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆలిండియా లాయర్స్ యూనియన్ మహాసభ నిర్వహించారు. ఐఎల్‌యూ రాష్ట్ర కార్యదర్శి నూకల వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు మేడపాటి ధర్మారెడ్డి మాట్లాడారు. న్యాయవాదులపై ఇటీవల కాలంలో దాడులు పెరిగి పోయాయని, న్యాయవాదుల రక్షణకు చట్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పిఠాపురం పట్టణ ఐఎల్‌యూ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘ గౌరవ అధ్యక్షుడిగా ఎం.రాజారావు, కేఎస్ఆర్ భాస్కర్, అధ్యక్షుడిగా ఆర్‌వీ రమణారావు, ప్రధాన కార్యదర్శిగా గుదిమెళ్ల శ్రీభాస్కరాచార్యులు, ఉపాధ్యక్షులుగా ప్రేమ సునందరావు, జీవీవీ సత్యనారాయణ, కార్యదర్శులుగా కొంగు నూకరాజు, ఎస్‌కే అబ్రిష, ట్రెజరర్‌గా సీహెచ్ మనో, సభ్యులుగా గుబ్బల సురేష్‌బాబు, రావుల రమేష్, కృష్ణవేణి, రేగస్‌రాజు, శాస్త్రీ, గౌతు రాజా, పుల్లరాజు, వైవీఎన్ మూర్తి ఎన్నికయ్యారు.

వైవీ రావు సేవలు చిరస్మరణీయం



సంతాపసభలో మాట్లాడుతున్న డీపీటీవో శ్రీనివాసరావు

కాకినాడ: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వైవీ రావు అందించిన సేవలు శ్లాఘనీయమని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఏపీపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీ రావు ఆకస్మిక మృతికి డిపోలో శనివారం సంతాపసభ నిర్వహించారు. డీపీటీవో శ్రీనివాసరావుతో పాటు యూనియన్ ప్రతినిధులు, ఆర్టీసీ ఉద్యోగులు ఆయనకు సంతాపం తెలియజేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎల్ఎస్ నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పి.జార్జిబాబు, జిల్లా కార్యదర్శి పి.సత్యానందం, కాకినాడ డిపో కార్యదర్శి ఆర్.ఇందేష్, ఏలేశ్వరం డిపో కార్యదర్శి యూబీఎం కుమార్, తుని డిపో కార్యదర్శి బి.రమణ ముఖ్య అతిథులుగా పాల్గొనగా, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కె.ఎస్.నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ఆర్ కుమార్, ఆర్టీసీ అధికారులు, కాకినాడ జిల్లా ఉద్యోగులు, నాయకులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొమరగిరిలో చురుగ్గా ఇళ్ల నిర్మాణాలు

- ఉగాది నాటికి సిద్ధమయ్యేలా చూడాలి
- అధికారులకు కమిషనర్ ఆదేశం



గృహనిర్మాణ ప్రగతిని పర్యవేక్షిస్తున్న కమిషనర్ నాగనరసింహారావు, అధికారులు

కాకినాడ: పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా కొమరగిరి లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని నగరపాలకసంస్థ కమిషనర్ (ఎఫ్‌ఏసీ) సీహెచ్ నాగనరసింహారావు అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన కార్పొరేషన్, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా, హౌసింగ్ అధికారులతో కలసి కొమరగిరి లే అవుట్‌ను సందర్శించారు. అక్కడ ఇళ్ల నిర్మాణ ప్రగతిని సమీక్షించారు. లే అవుట్‌లో ఏర్పాటు చేసిన ఇటుకల పరిశ్రమను, గృహ నిర్మాణ సామగ్రి నాణ్యతను నిర్ధారించే యంత్ర పరికరాలను పరిశీలించారు. ఈ లే అవుట్‌లో 13,566 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు కాగా, 8,600 మంది ఇళ్ల నిర్మాణాలకు అగ్రిమెంట్ చేసుకున్నారన్నారు. వీటిలో 3,128 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. లే అవుట్‌లో వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మూడు నెలల్లో 16 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు కానుందని, వీధికి ఒకటి చొప్పున 170 ట్రాన్స్‌ఫార్మర్లు సిద్ధం చేశామని, వెయ్యి విద్యుత్ స్తంభాలకు 750 వేశామన్నారు. ఇళ్లు నిర్మించుకున్నవారికి వెంటనే తాగునీరు, విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ లే అవుట్ మరో టౌన్‌షిప్‌గా అవతరించబోతుందని అన్నారు. ఇక్కడి లబ్ధిదారులకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు దక్కేలా కుటీర పరిశ్రమలు ఏర్పాటు కాబోతున్నాయన్నారు. ఉగాది నాటికి నిర్మాణాలు పూర్తిచేసి గృహ ప్రవేశాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డీఈ సత్యనారాయణరెడ్డి, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఏఈలు, కాంట్రాక్టర్లు, పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే సత్ఫలితాలు

డీఈఓ అన్నపూర్ణ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ అన్నపూర్ణ

కరప: పదో తరగతి పరీక్షలకు నెల రోజుల సమయం ఉందని, విద్యార్థులు ఇప్పటి నుంచి శ్రమిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి కేవీఆర్ఎస్ అన్నపూర్ణ సూచించారు. మండల పర్యటనలో భాగంగా శనివారం ఆమె ఎంపీడీఓ కర్రె స్వప్న, ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణిలతో కలసి కరపలోని నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల, గొర్రిపూడిలోని హైస్కూల్‌ను సందర్శించి, టెన్త్ విద్యార్థులతో సమావేశమై పలు సూచనలు ఇచ్చారు. సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు చెప్పిన ప్రణాళిక ప్రకారం పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. పరీక్షలలో మంచి ఫలితాలు సాధించి, తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని డీఈఓ సూచించారు. కొద్దిసేపు పాఠ్యాంశాలపై విద్యార్థులతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్ఎంలు యు.లీలా మనోహర్, బీవీ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు న్యాయ సహాయం అందించాలి

- జిల్లా జడ్జి కమలాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న మూడో అదనపు జిల్లా జడ్జి కమలాదేవి

కాకినాడ లీగల్: ఆర్థికంగా బలహీనమైన అట్టడుగు వర్గాల వారికి ఉచిత న్యాయ సహాయం అందించడమే లక్ష్యమని కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పి.కమలాదేవి తెలిపారు. స్థానిక కోర్టు హాల్‌లో నూతన ప్యానల్ అడ్వకేట్లతో అదనపు జిల్లా జడ్జి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్యానల్‌కు ఎంపికైన న్యాయవాదులు ఇకపై నిందితులకు న్యాయ సేవలను అందిస్తారన్నారు. ప్యానల్ న్యాయవాదులకు విధి విధానాలను వివరించారు. ఈ సమావేశంలో ప్యానల్ అడ్వకేట్లు పాల్గొన్నారు.

వ్యక్తిగత రక్షణకు మార్షల్ ఆర్ట్స్



తైక్వాండో క్రీడాకారులతో జాతీయ స్క్వాష్ క్రీడాకారుడు రాజీవ్ రెడ్డి తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): మానసిక వికాసానికి, దేహ దారుఢ్యానికి, వ్యక్తిగత రక్షణకు మార్షల్ ఆర్ట్స్ అవసరమని 9వ సార్లు జాతీయ పతకాలు సాధించిన స్క్వాష్ క్రీడాకారుడు రాజీవ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక శ్రీనగర్ స్కూల్‌లో తైక్వాండో సంఘ కార్యదర్శి బి.అర్జునరావు ఆధ్వర్యంలో జరుగుతున్న తైక్వాండో శిక్షణ కేంద్రాన్ని ఆయన సందర్శించి క్రీడాకారుల నైపుణ్యాన్ని పరిశీలించారు. అతిథులు రాజీవ్ రెడ్డి, రామిరెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘ కార్యదర్శి పద్మనాభం విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. అనంతరం తైక్వాండో సంఘ కార్యదర్శి అర్జునరావు శాలువాలతో అతిథులను సత్కరించారు.

పోలీసు సిబ్బంది పనితీరుకు ప్రశంస



పాపారావుకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

కాకినాడ క్రైం: విధి నిర్వహణలో సమయస్ఫూర్తి, అంకితభావంతో వ్యవహరించి కీలక నిందితులను గుర్తించిన ఇద్దరు పోలీసులను ఎస్పీ రవీంద్రనాథ్ బాబు అభినందించారు. ఉప్పాడ కొత్తపల్లికి చెందిన కానిస్టేబుల్ యు.పాపారావు, హోమ్‌గార్డ్ వి.సత్తిబాబు శనివారం ఉదయం విధులు ముగించుకుని పిఠాపురం వైపు బయలుదేరారు. మార్గమధ్యలో కొండెవరం గ్రామ శివారున రోడ్డు పక్కన నిలిపి వుంచిన మోటారు సైకిల్‌ను మరొక మోటార్ సైకిల్‌పై ముగ్గురు వెళ్తూ ఢీకొట్టడాన్ని గమనించారు. వారిలో ఇద్దరు వ్యక్తులు గాయపడగా, మూడో వ్యక్తి అక్కడి నుంచి పారిపోయాడు. సత్వరం స్పందించిన ఇద్దరు పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఉప్పాడ పీహెచ్‌సీకి తరలించారు. మూడో వ్యక్తి కోసం పోలీసులు ఆరా తీయగా, వారు ముగ్గురూ పాత నేరస్తులని తేలింది. దీంతో సిబ్బంది ఆ విషయాన్ని ఉన్నతాధికారులకు విన్నవించారు. పోలీసుల సమయస్ఫూర్తిపై ఎస్పీ వారిని సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఉల్లంఘనులకు కౌన్సెలింగ్

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి రోడ్డుప్రమాదాలకు కారణమవుతున్న వాహనచోదకులను వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారు ప్రయాణిస్తున్న వాహనాలను సీజ్ చేసి ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. హెల్మెట్ ధరించని, లైసెన్సులు లేని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న పలువురిపై కేసులు నమోదు చేసి కౌన్సెలింగ్ ఇచ్చినట్టు కాకినాడ ట్రాఫిక్ డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు.

దిశ డౌన్‌లోడ్ చేసుకోవాలి



దిశ యాప్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీఐ మురళీకృష్ణ

కాకినాడ రూరల్: ఆపద సమయంలో దిశ యాప్ ద్వారా రక్షణ లభిస్తుందని సర్పవరం సీఐ ఆకుల మురళీకృష్ణ తెలిపారు. రమణయ్యపేటలోని ఏపీఎస్పీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో దిశ–చేతన కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులు దిశ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. తద్వారా పోలీసుల నుంచి రక్షణ కలుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పుల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.